

# వృక్షశాస్త్రం

మా బోటనీ లెక్చరరుకి సరసం, వ్యంగ్యం యిష్టం. కొమ్మలు, రెమ్మలు, పూలు, కాయలు, పండ్లు, కింజెరాలు, మొక్కలు, వృక్షాలు, బోదెలు, వేళ్లు, కాడలు, తొడిమలు, చిగురు, మొగ్గలు, పిందెలు, పూత, యెండినవి, వాడినవి అన్నీ నల్లబల్లమీద వేస్తుంది. మా చేతా రికార్డు బుక్‌లో వేయిస్తుంది. కరెక్ట్ చేసి తెచ్చి వాడాక పుస్తకంలో వుంచుతాము. కొన్ని యెదురుగా వుంచి చూసివేయమంటుంది. పెన్సిల్‌తో స్కెచెస్ వేస్తే లైట్ అండ్ షేడ్ యివ్వాలి. హెచ్, బి హెచ్ పెన్సిల్స్ కొని ముక్కలు మొనలుండేట్టు బండముక్కు, గొడ్డలి చివరలాగాను చెక్కిస్తుంది. తానూ నల్ల బల్లమీద సీమ సున్నంతోనే సహజంగా కనబడేట్టు అలాగ్గా గీస్తుంది. రంగు చాక్‌పీసులూ వాడుతుంది. వృక్షశాస్త్రంలో తీసుకునే విద్యార్థినుల సంఖ్యే పెరిగింది. జూ ఆలజీ, బయోలజీ తీసుకునే వారు తక్కువ.

పాఠం చెప్పేప్పుడు, లెక్చరిస్తున్నట్టుగాక, హాస్యం వ్యంగ్యం జోడించి మొహం మొత్తకుండా చెపుతుంది.

మనిషిపూలతీగలాగా వుంటుంది. మెషీన్ మీద లాగిన నాజూకైన నగలు కాసిని మెరుస్తూ కనిపిస్తాయి ఆమె వంటి మీద. తల కట్టు అలంకారం డ్రెస్ చేసుకోటం మోడరన్ వుమన్‌లాగా చేస్తుంది. డిప్ అండ్ డ్రై, ఫుల్‌వాయిల్, టెర్రీకాటన్, కాష్మీర్ సిల్క్ చేతులు మృదువుగా వుండి గోళ్లకు రంగు వేసుకుంటుంది. నవ్వు మొహం విచ్చిన గులాబీలాగా వుంటుంది. అరచేతులు నిత్య మల్లెలలాగా వుంటాయి. కళ్లు కాటుక బెట్టినట్టుంటాయి.

నల్లరాతి మీద ఒక మొక్క బొమ్మ వేసి దాని నెత్తిమీద వామెంట అని వ్రాసింది. మేము మా నోట్ బుక్‌లో కాపీ చేశాము. దాని హాబిట్ అండ్ హాబిటట్ చెప్పింది మా వంక చూస్తూ. అది ఓషధి మొక్క. తరవాత వాము మొక్క దాని అలవాట్లు, వుపయోగం, తుమ్మ, ఉమ్మెత్త, రుద్ర జడాకు మొక్క, మాచిపత్రి, సబ్జా, లవంగ తీగ, యాలకి తీగ, అలా వేస్తూ చెపుతూ డస్టర్‌తో తుడుస్తూ పాఠం సాగించింది మేడమ్. ఒక మనిషి బొమ్మ వేసి మా వేపు చూసింది మేడమ్.

''యంగ్ లేడీస్! మంత్రశాస్త్రంలో, కవిత్వంలో మనుషుల్ని చెట్లుతోనూ, వృక్షాలతోనూ, లలితమైన పూదీగలతోనూ, విరియబూసిన ఫలవృక్షాలతోనూ పోలుస్తారు. కృష్ణలీలలు చిత్రంలో రెండు మద్ది చెట్ల మధ్యగా చిన్న కృష్ణుడు రోలు యీడుస్తూ తాడుతోపోతే ఆ రెండు చెట్లు కూలి యిద్దరు మనుషులైనారు. అల్లరి చెయ్యకుండా యెటుపోకుండా వాళ్లమ్మ యశోద కృష్ణుని నడుముకి తాడు కట్టి ఆ తాడు రెండో చివర రోటికి కట్టింది. తాడి చెట్టంతవాడు అని పొడగరిని బలశాలిని వర్ణిస్తారు. చెట్టంత కూతురుపోతే, చెట్టంత కొడుకుపోతే అని తల్లి దుఃఖిస్తుంది. అంటే అండదండగా వుండి యెదిగిన బిడ్డ. దానికేం చెట్టంత మగడున్నాడు అంటారు. అంటే రక్షణ వున్నదని. సంపాదించింది సంపాదించినట్లు అంతా ఖర్చు అయిపోతుంటే, యెంత చెట్టుకు అంత గాలి అని అంతా అయిపోయే అన్ని ఖర్చులు తగులుతున్నాయని, బీరతీగలాగా అంటే పచ్చని చిన్నపూలతో అందంగా లలితంగా కనబడుతుంది నగలున్న వయసొచ్చిన అమ్మాయి. మనుషులలాగే కొన్ని సెకెండ్లు జీవిస్తే కొన్ని పురుట్లో సంధికొట్టినట్లు పోతాయి. కొన్ని బాగా వుపయోగపడతాయి మనుషులవల్లేనే తాటి, యీత, మంచిగంధం చాలా వుపయోగం. స్తంభాలల్లేనూ, కాలవ దాటెందుకు తాగాడి

లాగానూ, ఏతాము లాగానూ తాటి వుపయోగపడుతుంది. తాటి ఆకులు, ముంజెలు, పండ్లు, గుంజు, బెల్లం యెన్నో అందిస్తాయి. చెట్లలోనూ మగచెట్లు ఆడ చెట్లు వుంటాయి. తీగలు అల్లుకుపోయిన అడివి చెట్లను చూస్తాము. మగ చెట్లు పుష్పించి ఫలించవు. బొప్పాయి చెట్టు తెలుసుగా. చూచేవుంటారు. అది ఆడా మగా యెలా తెలుస్తుందంటే బోదెకు ఆకుకాడకూ మధ్య ఒక మొగ్గ కనబడితే అది ఆడచెట్టు. ఫలిస్తుంది. పువ్వు పిందె అయి కాయ అయి పెద్దదై పండుతుంది. కాని బోదెకు పొడుగాటి కాడకూ మధ్య తొడిమలాగా కనబడుతూ పూలగుత్తి కనబడితే అది మగచెట్టు ఫలించదు. మీరు విన్నారో లేదో శిలలు నిద్రబోతాయి. నిద్రబోతున్న శిలను సుత్తెతో కొట్టినా పగలదు. అదే సముద్రం అడుగున పడివున్న చిన్న ఊాయి అయితే వత్తిడి వల్ల, కెమికల్సు వల్ల పరిసరాల వల్ల, మన్ని వుండటం వల్ల వజ్రమవుతుంది. అలాగే మానవులు ఈ చెట్టు'' అంటూ చెట్టు బొమ్మ మనిషిలాగా కనబడేట్టు నల్లరాతిమీద చిత్రించింది వేడవ్. ''దీని హాబిట్ హాబిటాట్ తెలుసుకుందాము. పూవుపుట్టగానే పరిమళిస్తుందని సామెత వినే వుంటారు మీరు. అలాగే చిన్నప్పటినించే తోటి పిల్లలని యేడిపించటం, యిద్దరి మధ్యా పడకుండా చేయటం, పెటకం పెట్టటం, భాగ్యవంతుల బిడ్డలతో తిరిగి ఆడిపాడి సాయపడుతున్నట్లు నటించటం మొదలైన గుణాలు వెల్లడౌతాయి. పెరిగిన కొద్దీ పరాన్న భుక్ అగును. స్వంత ఆస్తి కాపాడుకోలేక నేర్పుగా మరొకరి యిల్లు ఆక్రమించటం చేయును. యెదుటి వారి వద్ద డబ్బున్నదని వాసనబట్టగలదు. రాక్షసుడు నరవాసన పట్టినట్లన్నమాట'' అని చెప్తుంటే స్టూడెంట్సు నవ్వారు.

''అదంతా ఖర్చు చేయించే దాకా, యింకా నిజం చూస్తే అదంతా లాగేసేదాకా వదలదు. కోల్పోయిన వ్యక్తికి యీమె హాబిట్ చివరికిగాని

నష్టపోయాకగానీ తెలియదు. చెట్టు మాటిమాటికి చిగిర్చినట్లు యీ అలవాటు రిపీట్ చేస్తుంది. క్షామం, కాటకం, యుద్ధాలు, ధాత కరువు, అతివృష్టి, అనావృష్టి, యెండలకు, వానలకు, ఒడిదుడుకులకు తట్టుకుంటూ శతమానం చూస్తుంది. కొట్టవచ్చినట్టు కనబడే హాబిట్, డబ్బు వూడిపడకపోగానే, కనులెర్రజేసి హిట్లరవతారమెత్తును. తనిష్టమెచ్చినట్టు వెూసం చేయనీయకపోయినా అదే స్టైల్. మీరు వనాల్ని పరిశీలిస్తూ పోతే వనమంతా తిరిగి చూస్తే యిటువంటి వృక్షాలు కానవస్తాయి. వాటిని మ్రానులు అంటారు. మనిషా మానా? అంటారు చలించని మనిషిని. డబ్బుంటే తృణప్రాయమని నమ్మిస్తుంది. ఒక్కతే వస్తే దర్పం చూపుతూ వంట చేయదు పనీ ముట్టుకోదు. వ్యవహారాలు మాట్లాడుతుంది లేదా వేత్తలాగా మాట్లాడుతుంది. వెంట గుంపునిగానీ, మందనుగానీ తీసికెళ్తే మర్యాదస్తురాలిలాగా, పనిమంతురాలు లాగా వంటింట్లో దూరి వంట చేస్తుంది. కళ్లాపి చల్లి, యిల్లు శుభ్రం చేసి, బట్టలుతకటం, నీళ్లు తోడటం చేస్తుంది. తానెంత పనిమంతురాలో గమనిస్తున్నారా లేదా అని పక్కచూపులు చూస్తుంది. మరో హాబిట్ యెవర్నన్నా నెత్తినెక్కించి తాను వెళ్లిపోతుంది''.

డస్టర్‌తో నల్లరాయి శుభ్రం చేసి మరో చెట్టు బొమ్మగీసింది కళ్యాణి మేడమ్. ఆ చిత్రం గీయటంలోనే వున్నదామె ప్రతిభ అంతా. చెట్టులాగే కనబడుతూ అంతలోనే వృద్ధనారిలాగా తేలి కనబడుతుంది. బలంగా దృఢంగా యెత్తుగా పెరుగుతూ శాఖోపశాఖలేసినట్లు కనబడుతుంది.

''పొట్లకి పొడగిట్టదని ఒక సామెత వున్నది అమ్మాయిలూ. పొడ అంటే తనవేపు బంధువులే వేయటానికి రావటం, తనాశ్రయించుకుని

వుండాలనుకోటం యీ వృక్షం హాబిట్. వేరెవరూ తన నీడన వుండరాదు. రారాదు. వస్తే యీ చెట్టు తన చుట్టూ నేలమీద చీమల పుట్టలు, కండ చీమలూ సృష్టిస్తుంది. అది హాబిటాట్. అండదండా, వ్యవహార దక్షత గలదానిననీ, అందరూ తనకు లోబడి తను చెప్పినట్టు నడుచుకోవాలని చెప్పును. అలా చేయకపోతే భ్రష్టులౌతారని ధడిపించును. ముళ్లజెముడు, బొమ్మజెముడు మొదలైనవి నీటిని, టాంకులో నీరు కాపాడినట్టు, తమలో నిలవజేసుకుని గ్రీష్మంలో గూడా బాగుంటాయి. ఆకుపచ్చగానే వుంటాయి. అలాగే ఈ వృక్షం మంచితిండి పుష్టిగలది గనక, అన్నిరకాల వ్యాధులకూ తట్టుకుంటూ, కూడబెట్టి దాచిన చేవవాడుకుంటూ తొంబదేండ్లు మనును''.

చెరిపేసి యీ మాటు కల్యాణి మేడమ్ చాలా ఎట్రాక్టివ్‌గావున్న చెట్టు చిత్రించింది చాక్‌పీసుతో. విరయబూసిన, విరగగాసిన గున్నమామిడిలాగా వున్నదా చిత్రం. పూతా, చిగుళ్లూ గూడా కానవస్తున్నాయి. కోకిల ఆ తోపురంగు చిగుళ్ల ముక్కుతో తుంపి తిని తీయగా పంచమస్వరంలో కోకో అని కూస్తున్నది. ''విత్తనంబు చూడ మర్రి వృక్షంబునకునెంత?'' అన్నాడు ప్రజాకవి. మేడిపండు చూడ మేలిమై యుండును పొట్టవిచ్చి చూడ పురుగులుండు. పురుషులందు పుణ్యపురుషులు వేరయా అని గూడా పాడాడు. దాన్ని బట్టి తేలేదేమనగా ఆ వృక్షం యొక్క హాబిట్ అండ్ హాబిటాట్ దాని విత్తనంలోనే దాగి వుండును అని. మీమాంసకులు విత్తు ముందా చెట్టు ముందా అని వాదిస్తారు అందుకే. చెట్టు స్వభావం విత్తనం లోనే వుంటుంది. వాతావరణం, పరిసరాలు, నేలలో సారం లేకపోవటం, అతివృష్టి అనావృష్టి, యెరువు అందకపోవటం, పురుగుపట్టటం వంటివిగూడా చెట్టును పీడిస్తాయి. నేల సారవంతమై

యెరువులంది, సకాలంలో వర్షం పడి, వాతావరణం అనుకూలిస్తే చెట్టు వుపయోగకరంగా యేపుగా పెరుగుతుంది. ఈ చెట్టు అలాటిది. మంచి ఐడియాస్, శుచి శుభ్రత, కల్చర్, ప్రేమానుబంధాలు, స్నేహము, నాగరకత కలిగి పెరిగింది. విత్తనమూ మంచిదే. కాని వాతావరణం మారింది. నేలలో పెద్దరాయి తాకింది వేళ్లకూ తల్లివేరుకూ. అంటే హెరిడిటరీ వ్యాధి తాకింది. అది చెట్టూ తప్పుగాదు, విత్తనం తప్పుగాదు. విషమపరిస్థితులనే పురుగుపట్టింది. అంతే, నీడనిచ్చేదీ, పుష్పించి ఫలించేదీ అందమైన చెట్టు కళావిహీనమై యూస్‌లెస్ అయింది. నేలలో యెక్కడన్నా సారమున్నదేమో, ఆ సారాన్ని వేళ్లద్వారా పీల్చి, అందంగా ఆకర్షవంతంగా వుందామని, ఫలిద్దామని, నీడనిద్దామని శతవిధాల ప్రయత్నించింది. ఆ ప్రయత్నమే ఆ చెట్టు యొక్క హాబిట్''.

''చెట్లను, కొండలను అచరములు అంటారు. చరమంటే కదలగలిగేది. వున్న చోటు నించి కదలలేనివి అచరములు. అందువల్లే యీ గున్నమామిడి చెట్టు వున్న చోటునించి కదలలేక పోయింది. అదే హాబిటాట్. వాతావరణమన్నా సాయపడుతుందేమో వర్షాలన్నా బలమిస్తాయేమోనని ఆశిస్తూ యీ చెట్టు అదే నేలలో అరవై యేళ్లు బతికింది. చెట్టుగూడా త్వరగా యెండి మోడుగాదు. కూలదు. ప్రేమ, స్నేహము నశించని మనుషులూ ఆశతోనే జీవిస్తారు''.

చేతి గడియారం చూసుకుని యింకా టైముందని మరో బొమ్మ గీసింది మేడమ్. దీనిపేరు తంగేడు. వీటిని బాటలకు రెండు పక్కలా నాటుతారు. వసంతం వచ్చిన నాటికి అన్నీ రాల్చి మోడులాగా కనిపిస్తుంది. కాని వసంతం గడుస్తుండగా యెర్రని పూలు మొగ్గలు చిగుళ్ల కన్నుల పండుగగా విరియబూస్తాయి. విచ్చిన యెర్రని పూలగుచ్ఛాలే యెక్కువేమో అన్నట్లు

ఆకులంతగా కనబడవు. పైగా వ్యాపించిన కొమ్మలను రెమ్మలను, కనువిందు చేసే పూలనే చూస్తూ బాటపక్కగా నడుస్తూ మైమరుస్తాము. మనుషులూ అంతే సంపదలందగానే కలకలలాడుతూ కనిపిస్తారు. దరిద్రం ఆవరించినప్పుడు మోడులాగా కానవస్తారు''.

టైమైందని గంట వినబడింది. మేడమ్ నల్లరాయి తుడిచింది. మైమరచి వింటూ చూస్తున్న విద్యార్థినులు చైతన్యం పొందినట్టు లేచారు.

కథా నిలయం
5249
శ్రీకాకుళం